క్లుప్తంగా

ఎల్‌ఓసీ అందజేత



ఎల్‌ఓసీ పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే

షాద్‌నగర్: సీఎం సహాయనిధి పేదలకు వరం లాంటిదని ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ పేర్కొన్నారు. ఫరూఖ్‌నగర్ మండలం చించోడ్‌కు చెందిన సాయికృష్ణ అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆర్థిక సహాయం అందించాలని బాధిత కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే అంజయ్య యాదవ్‌ను కోరారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే సీఎం సహాయనిధి నుంచి రూ.2.50లక్షలు మంజూరు చేయించారు. దీనికి సంబంధించిన ఎల్‌ఓసీ పత్రాన్ని మంగళవారం లబ్ధిదారుడికి అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ గణేష్, మండల పార్టీ అధ్యక్షుడు లక్ష్మణ్‌నాయక్ పాల్గొన్నారు.

సర్వీసు రోడ్డు లేక.. ఇక్కట్లు

రోడ్లు నిర్మించాలని వాహనదారుల విజ్ఞప్తి



సర్వీసు రోడ్డు నిర్మించే స్థలంలో మొలిచిన చెట్లు

షాద్‌నగర్: బైపాస్ జాతీయ రహదారి పక్కన సర్వీసు రోడ్డు లేక ఆయా గ్రామాల వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. కొత్తూరు నుంచి షాద్‌నగర్ శివారు వరకు ఉన్న బైపాస్ జాతీయ రహదారి పక్కన సర్వీసు రోడ్డు నిర్మించాలని గతంలో చటాన్‌పల్లి గ్రామస్తులు, ఆయా తండావాసులు అధికారులు, ప్రజాప్రతినిధులను కలిసి వినతి పత్రాలను అందజేశారు. సర్వీసు రోడ్లు లేక చుట్టూ తిరిగి రావడంతో దూరం పెరిగి ప్రమాదాల బారిన పడుతున్నామని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు సర్వీసు రోడ్లు నిర్మించేలా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు, వాహనదారులు వేడుకుంటున్నారు.

లోక్ అదాలత్‌లో 58 కేసులు పరిష్కారం



కేసులను విచారిస్తున్న రిటైర్డు జడ్జి సాంబశివరావు

చేవెళ్ల: మద్యం సేవించి వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని రిటైర్డు సీనియర్ సివిల్ జడ్జి సాంబశివరావు అన్నారు. మంగళవారం లోక్ అదాలత్‌లో 58 మద్యం సేవించి వాహనాలు నడిపిన కేసులు పరిష్కరించినట్లు తెలిపారు. ఈ కేసులకు సంబంధించి రూ.1,63,000 జరిమానా విధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించి పట్టుబడిన కేసులను పరిష్కరించుకోవాలన్నారు. పెండింగ్ కేసుల పరిష్కారానికి లోక్‌అదాలత్ ప్రత్యేక డ్రైవ్‌ను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈనెల 10వ తేదీన వరకు లోక్ అదాలత్ జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ వాసు, ఎస్‌ఐ విఠల్‌రెడ్డి, ఏఎస్‌ఐ చందర్‌నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

సీఐకు సన్మానం



సీఐ నరేష్‌ను సన్మానిస్తున్న నాయకులు

శంకర్‌పల్లి: మండలంలోని మోకిల పోలీస్‌స్టేషన్ సీఐ నరేష్‌ను గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు మంగళవారం పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. మోకిలలో నూతన పోలీస్ స్టేషన్‌ను ఏర్పాటు చేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గౌండ్ర సత్యం, నాయకులు మన్నె వెంకటేష్, శేఖర్, నర్సింలు, వెంకట్, రాజు, సీహెచ్ శేఖర్, భిక్షపతి, శ్రీశైలం, సంజీవ తదితరులు పాల్గొన్నారు.

పాటుకాల్వలకు మరమ్మతులు చేపట్టండి

కొత్తూరు: మండలంలోని ప్రధాన చెరువులకు వరద నీటి ప్రవాహం తీసుకొచ్చే పాటుకాల్వలకు మరమ్మతులు చేపట్టాలని కొత్తూరు మత్స్యశాఖ సంఘం సభ్యులు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. వెంచర్ల ఏర్పాటు కారణంగా ఇప్పటికే పలు గ్రామాల్లో కాల్వలను వ్యాపారులు ధ్వంసం చేసినట్లు తెలిపారు. మరికొన్ని చోట్ల ప్రకృతి సహజ సిద్ధంగా ఏర్పడిన కాల్వలను దారి మళ్లించడంతో వరద ప్రవాహం రోడ్లు, పంట చేళ్లలో పారుతుందని అన్నారు. ఇప్పటికైనా ఇరిగేషన్, రెవెన్యూ శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరించి ధ్వంసమైన కాల్వలకు మరమ్మతులు చేపట్టాలని కోరారు.

పారిశ్రామిక పరుగులు



షాబాద్: పరికరాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే



నందిగామ: మాట్లాడుతున్న ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

ఎమ్మెల్యే కాలె యాదయ్య

షాబాద్: రాష్ట్రంలో పారిశ్రామిక రంగం పరుగులు పెడుతోందని ఎమ్మెల్యే కాలె యాదయ్య పేర్కొన్నారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా మంగళవారం మండలంలోని చందనవెళ్లిలో ఇండస్ట్రియల్‌లో పారిశ్రామిక ప్రగతి ఉత్సవంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. అనంతరం పరిశ్రమలో తయారు చేసిన పరికరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో నెలకొల్పే పరిశ్రమల్లో స్థానికులకు ఎక్కువ ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణలో పారిశ్రామిక రంగం పరుగులు పెడుతుందని చెప్పారు. పారదర్శకతకు పెద్దపీట వేస్తూ టీఎస్‌ఐ–పాస్‌ను అందుబాటులోకి తేవడంతో అనుమతుల ప్రక్రియ సులభతరమైందని తెలిపారు. కొత్త పరిశ్రమల ఏర్పాటుతో లక్షలాది మందికి ఉపాధి అవకాశాలు దొరుకుతున్నాయని టీఎస్–ఐపాస్ ద్వారా జిల్లాలో ఇప్పటి వరకు రూ.80,217.08 కోట్ల పెట్టుబడితో 1,715 యూనిట్లకు అనుమతులు ఇచ్చామన్నారు. తద్వారా 9,75,979 మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. ఐటీ రంగంలో హైదరాబాద్ నగరం దూసుకుపోతోందని, ఈ రంగంలో ఎంతో పురోగతి సాధించామన్నారు. ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ కృషితో ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో చేవెళ్ల ఆర్డీఓ వేణుమాధవ్‌రావు, తహసీల్దార్ సైదులుగౌడ్, ఎంపీడీఓ అనురాధ, సర్పంచ్‌లు ప్రభాకర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, మల్లేష్, పాండురంగారెడ్డి, ఎంపీటీసీ జముకమ్మ, పారిశ్రామిక వేత్తలు సత్యం సుందర్‌రెడ్డి, జనార్దన్ తదితరులున్నారు.

బీఆర్‌ఎస్‌తోనే పారిశ్రామిక ప్రగతి

నందిగామ: బీఆర్‌ఎస్ ప్రభుత్వం పరిశ్రమల ఏర్పాటుకు మంచి వాతావరణం కల్పిస్తుండడంతో వేలాది మంది పారిశ్రామిక వేత్తలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తున్నారని ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం పారిశ్రామిక ప్రగతి ఉత్సవాన్ని మండలంలోని రంగాపూర్ శివారులోని నాట్కో పాఠశాల ఆవరణలో ఉపాధి కల్పన శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకు అనువైన వాతావరణం ఉందన్నారు. సీఎం కేసీఆర్ పరిశ్రమల అనుమతులకు సులువైన విధానాన్ని ప్రవేశపెట్టాడని గుర్తుచేశారు. ఒక ప్రాంతానికి పరిశ్రమలు రావాలంటే అనువైన వాతావరణం, శాంతి భద్రతల సమస్య లేకుండా ఉండడం, విద్యుత్, నీరు, మౌలిక వసతులు ఉండాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ సదుపాయాలన్నీ కల్పిస్తోందన్నారు. దీంతో లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు వస్తున్నాయని వివరించారు. పారిశ్రామిక ప్రగతితో ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్షలాది మంది నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని చెప్పారు. ఉత్సవాల్లో భాగంగా జిల్లా నుంచి ఈ కార్యక్రమానికి 120 మంది నిరుద్యోగులు హాజరు కాగా 53 మందిని పలు పరిశ్రమల నిర్వాహకులు ఉద్యోగాలకు ఎంపిక చేశారని తెలిపారు. అనంతరం ఉద్యోగంలోకి చేరిన వారికి ఎమ్మెల్యే నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్‌చైర్మన్ గణేష్, జెడ్పీటీసీలు శ్రీలత, విశాల, కొత్తూరు మున్సిపల్ చైర్మన్ లావణ్య, ఎంపీపీలు ప్రియాంక, శోభా, వైస్ ఎంపీపీ మంజుల, డీసీసీబీ డైరెక్టర్ మంజుల రెడ్డి, తహసీల్దార్ రహ్మాన్ ఖాన్, ఎంపీడీఓ బాల్‌రెడ్డి, సర్పంచ్ రమేష్ గౌడ్, నాయకులు దేవేందర్ యాదవ్, రవీందర్, గోవు రవి, భాస్కర్, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలి



రక్తదానం చేస్తున్న ఎంపీడీఓ వెంకయ్యగౌడ్

ఎంపీడీఓ వెంకయ్య గౌడ్

శంకర్‌పల్లి: రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని ఎంపీడీఓ వెంకయ్యగౌడ్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని లక్ష్మారెడ్డిగూడలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒకరి రక్తదానం.. ముగ్గురి ప్రాణాలు కాపాడవచ్చని అన్నారు. ప్రతీ ఇంట్లో ఒకరు రక్త దాతను సమాజ సేవకుడిగా తయారు చేయాలని సూచించారు. రక్తదానం చేయడం వల్ల మనిషి ఆరోగ్యంగా ఉండడంతో పాటు కొత్త రక్తం తయారవుతుందని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి, కార్యదర్శి తిమ్మారెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



చిన్నారులతో మాట్లాడుతున్న గోపాల్, ఉపాధ్యాయులు పెంటయ్య



షాద్‌నగర్: చేతులు జోడించి వేడుకుంటున్న ఉపాధ్యాయుడు

- ఎస్‌టీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గోపాల్
- అజీజ్‌నగర్‌లో బడీడు పిల్లలను సమీకరిస్తున్న ఉపాధ్యాయులు

మొయినాబాద్‌రూరల్: పిల్లలను చదివించినప్పుడే విజ్ఞానం పెంపొందించుకుంటారని ఎస్‌టీఎఫ్ ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దొళ్ల గోపాల్ అన్నారు. మంగళవారం మండలంలోని అజీజ్‌నగర్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరుగుతూ బడీడు పిల్లలను తెలుసుకొని వారి పేర్లను నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా పిల్లలతో కలిసి వారి తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా నాణ్యమైన విద్యను అందజేస్తున్నాయని అన్నారు. ప్రభుత్వం విద్య, మధ్యాహ్న భోజనం, పాఠ్య పుస్తకాలు, స్కూల్ యూనిఫామ్ పంపిణీ చేయడం జరుగుతుందని చెప్పారు. పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి వారి భవిష్యత్తుకు తల్లిదండ్రులు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో శోభారాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న బడిబాట

షాద్‌నగర్: బడీడు పిల్లలను బడిలో చేర్పించేందుకు ప్రభుత్వం బడిబాట కార్యక్రమం నిర్వహిస్తుంది. ఇందులో భాగంగా మంగళవారం ఫరూఖ్‌నగర్‌లోని ఆయా ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహిస్తున్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా విద్యార్థులను ప్రైవేట్ పాఠశాలలకు కాకుండా ప్రభుత్వ పాఠశాలలకు పంపించాలని కోరుతూ మండలంలోని రాయికల్ గ్రామంలో ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు ఇంటింటికి వెళ్లి చేతులు జోడించి తల్లిదండ్రులను వేడుకున్నారు.

చిన్నారులను బడి మాన్పించొద్దు

కొందుర్గు: చిన్నారులను ఎట్టి పరిస్థితిలో బడి మాన్పించొద్దని ఉపాధ్యాయులు నర్సింలు సూచించారు. మంగళవారం ఇంద్రానగర్ ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లేడ్ చౌదరిగూడ మండలంలోని పద్మారం, ఎల్కగూడ, ఇంద్రానగర్ గ్రామాల్లో పర్యటించి విద్యార్థులను పాఠశాలలో చేర్పించారు. అనంతరం ఉపాధ్యాయులు నర్సింలు మాట్లాడుతూ.. ప్రభుత్వం విద్యార్థులను ఉన్నత చదువులు చదివించాలని అనేక పథకాలు ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. వాటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు యాదయ్య, రాములు, అక్రమ్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బొడ్రాయి పునఃప్రతిష్ఠాపన



బొడ్రాయికి ప్రత్యేక పూజలు చేస్తున్న సర్పంచ్, తదితరులు

షాబాద్: భక్తిశ్రద్ధలతో బొడ్రాయి పునఃప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు లింగారెడ్డిగూడ సర్పంచ్ సులోచన తెలిపారు. మంగళవారం మండలంలోని లింగారెడ్డిగూడలో బొడ్రాయి పునఃప్రతిష్ఠాపన కార్యక్రమంలో వేదపండితులు మంత్రోచ్చరణ మధ్య వైభవంగా నిర్వహించారు. అనంతరం యజ్ఞ హోమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ...ఆధ్యాత్మిక చింతనతోనే ప్రతి ఒక్కరికి మానసిక ప్రశాంతత కలుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ జయమ్మ, నాయకులు శేఖర్‌రెడ్డి, వార్డు సభ్యులు, గ్రామస్తులు తదితరులున్నారు.

అంధత్వ నివారణే లక్ష్యం

సర్పంచ్ శ్రీలత

కేశంపేట: అంధత్వ నివారణే లక్ష్యమని అల్వాల సర్పంచ్ శ్రీలత అన్నారు. వైద్యశాఖ ఆధ్వర్యంలో మండలంలోని అల్వాలలో మంగళవారం కంటి వెలుగు శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలన్నారు. అవసరమైన వారికి ఉచితంగా ప్రభుత్వం అద్దాలు ఇస్తుందని చెప్పారు. కంటి ఆపరేషన్లు అవసరమైన వారికి ప్రభుత్వమే ఉచితంగా చేయిస్తుందని ఆమె తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. కార్యక్రమంలో డాక్టర్ కార్తీక్, శంకరయ్య, అంజయ్య, రాజు, రాజేందర్, మహేశ్, కృష్ణయ్య, యాదయ్య, నర్సింహ, జగదీష్, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



కంటివెలుగు శిబిరాన్ని ప్రారంభిస్తున్న శ్రీలత

అక్కివానిగూడ రోడ్డుకు మోక్షం ఎన్నడో?

- ఐదేళ్లుగా సాగుతున్న పనులు
- ఇబ్బందుల్లో వాహనదారులు



ఇటీవల కురిసిన వర్షాలకు బురదమయంగా మారిన రోడ్డు

కొత్తూరు: పేరు గొప్ప ఊరు దిబ్బ అన్న చందంగా మారింది కొత్తూరు మున్సిపాలిటీలోని కొత్తూరు–అక్కివానిగూడ రోడ్డు పరిస్థితి. ఎన్నో నిరసనలు, మరెన్నో వినతులు మధ్య పాలకులు మంజూరు చేసిన రోడ్డు పనులు గత ఐదేళ్లుగా కొనసాగుతున్నప్పటికీ పూర్తి కావడం లేదు. దీంతో ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు గుంతలు, బురదమయమైన రోడ్లపై నుంచి ఇబ్బందులు పడుతూ రాకపోకలు కొనసాగిస్తున్నారు.

కంకర పరిచారు.. రోడ్డు మరిచారు

మండల కేంద్రం నుంచి అక్కివానిగూడ వరకు రూ.1.76కోట్లతో మంజూరైన బీటీ రోడ్డును గత ఐదేళ్ల క్రితం ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ ప్రారంభించారు. పనులు ప్రారంభించి ఏళ్లు గడుస్తున్నా కాంట్రాక్టర్ నేటికి పనులను పూర్తి చేయలేదు. పాత జాతీయ రహదారి నుంచి ఎస్సీ కాలనీ వరకు సీసీ రోడ్డు, కుమ్మరిగూడ నుంచి అక్కివానిగూడ వరకు బీటీ రోడ్డు వేశారు. మధ్యలో ఉన్న రైల్వేస్టేషన్ నుంచి సీఎంటీఎల్ గేటు వరకు రోడ్డును అభివృద్ధి చేయడం లేదు. కంకర పరిచిన రోడ్లపై నుంచి ప్రయాణిస్తూ ద్విచక్ర వాహనదారులు కిందపడి తరచుగా ప్రమాదాల బారిన పడుతున్నారు. అంతేకాకుండా గుంతలు, రాళ్ల కారణంగా వాహనాలు దెబ్బతింటున్నాయని అక్కివానిగూడ, కుమ్మరిగూడతో పాటు పలు గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాంట్రాక్టర్లతో సకాలంలో పనులు చేయించడంలో అధికారులు విఫలమవుతున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కార్యకర్తలే పార్టీకి పట్టుగొమ్మలు

- ఎమ్మెల్యే కాలె యాదయ్య
- బీఆర్‌ఎస్ పార్టీ చేవెళ్ల పట్టణ అధ్యక్షుడిగా జైపాల్‌రెడ్డి నియామకం

చేవెళ్ల: పార్టీ పటిష్ఠతకు కార్యకర్తలే పట్టుగొమ్మలని ఎమ్మెల్యే కాలె యాదయ్య పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం చేవెళ్లకు చెందిన జూకన్నగారి జైపాల్ రెడ్డిని చేవెళ్ల టౌన్ అధ్యక్షుడిగా ఎంపిక చేసి నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీకోసం పనిచేసే కార్యకర్తలకు తగిన గుర్తింపు ఉంటుందని చెప్పారు. పార్టీని గ్రామస్థాయిలో బలోపేతం చేసేందుకు కార్యకర్తల కృషి వెలకట్టలేనిదని అన్నారు. పార్టీ సభ్యత్వం పొందిన వారికి బీమా సౌకర్యం కూడా కల్పిస్తోందని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో పార్టీని మళ్లీ అధికారంలోకి తీసుకువచ్చేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలనిన్నారు. కార్యక్రమంలో మండలపార్టీ అధ్యక్షుడు పి. ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి నరేందర్‌గౌడ్, సీనియర్ నాయకులు ఎం. క్రిష్ణారెడ్డి, రవీందర్, దండు సత్తి, కనక మామిడి శివశంకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, సాయికుమార్, వెంకటేశ్, కుమార్ ఉన్నారు.

పార్టీ కోసం పని చేసే వారికే పదవులు

శంకర్‌పల్లి: పార్టీ కోసం పనిచేసే వారికి పదవులు తప్పనిసరిగా వరిస్తాయని ఎమ్మెల్యే కాలెయాదయ్య పేర్కొన్నారు. మంగళవారం మండల బీసీ సెల్ అధ్యక్షుడు మన్నె లింగం, మండల మైనార్టీ సెల్ అధ్యక్షుడు షరీఫ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రాజునాయక్ ఆధ్వర్యంలో మోకిల గ్రామ బీఆర్‌ఎస్ పార్టీ నూతన కమిటీని ఎన్నుకున్నారు. గ్రామ పార్టీ అధ్యక్షుడిగా కమ్మరి గోపాల చారి, ఉపాధ్యక్షుడిగా బండమీద వెంకటేశ్, జనరల్ సెక్రటరీగా సంకేపల్లి యాదయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామాల్లో బీఆర్‌ఎస్ పార్టీ బలోపేతానికి మరింత కృషి చేయాలన్నారు. సీఎం కేసీఆర్ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఆనంద్, నాయకులు రవీందర్‌రెడ్డి, కుశలయ్య, నాగులు, సామెల్, నర్సింహా, సంగారెడ్డి, ఖాజ, జానీ, ఎండీ హక్, ఫయాజ్, అంజయ్య, యాదయ్య, శ్రీకాంత్, కృష్ణ, సుధాకర్, శ్రీనివాస్, కుమార్, మహిపాల్ పాల్గొన్నారు.



జైపాల్‌రెడ్డికి నియామక పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే, నాయకులు

సఖీ సెంటర్‌కు మానసిక వికలాంగులు



చిన్నారులను సఖీ సెంటర్‌కు తరలిస్తున్న అధికారులు

కొందుర్గు: ఇద్దరు మానసిక వికలాంగులను సఖీసెంటర్‌కు తరలించారు. జిల్లేడ్ చౌదరిగూడ మండలం చింతకుంటతండాకు చెందిన సభావత్ చిన్నమ్మ శంకర్‌ల కూతురు మనీషా(22), మెట్టుగడ్డతండాకు చెందిన సభావత్ కమలమ్మ, వెంకటేష్‌ల కుమారుడు (12), ఇద్దరు మానసిక వికలాంగులు. వీరి కుటుంబాలు ఆర్థికంగా వెనుకబడి ఉండడం, పుట్టుకతో మానసిక వికలాంగులు కావడంతో వారి పోషణ భారంగా మారింది. ఈ విషయమై స్థానిక అంగన్‌వాడీ టీచర్ వసంత, సర్పంచ్ హరినాయక్ ఐసీడీఎస్ అధికారులకు సూచించడంతో మంగళవారం సూపర్‌వైజర్ రేవతి, సీడీపీఓ నాగమణి ఆధ్వర్యంలో హైదరాబాద్ వనస్థలిపురంలోని సఖీ సెంటర్‌కు తరలించారు.

ఏం సాధించారని దశాబ్ది ఉత్సవాలు?



విలేకరులతో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

బీజేపీ నాయకుడు అనంత్‌రెడ్డి

చేవెళ్ల: ఏం సాధించారని దశాబ్ది ఉత్సవాల పేరుతో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని బీజేపీ మండల పార్టీ ప్రధాన కార్యదర్శి అత్తెల్లి అనంత్‌రెడ్డి ఆరోపించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ప్రజా సమస్యలను పక్కన పెట్టి బీఆర్‌ఎస్ ప్రభుత్వం సంబరాలు చేసుకుంటుందని విమర్శించారు. విద్యుత్ ఉద్యోగుల గోస వినని విద్యుత్ విజయోత్సవాలు అంటూ చెప్పుకోవడం సిగ్గుచేట అన్నారు. ఇచ్చిన హామీల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు ఉత్సవాల పేరుతో ప్రజాధనాన్ని వృథా చేస్తున్నారని మండిపడ్డారు. విద్యుత్ శాఖలో ఆర్టిజన్ ఉద్యోగులపై ఎస్మా ప్రయోగించి విధుల నుంచి తొలగించిన విషయం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. 100 యూనిట్లు నిరుపేదలకు ఉచిత విద్యుత్ ఇస్తామన్నా హామీ ఏమైందన్నారు. కరెంట్ బిల్లులు కట్టలేదనే నేపంతో పేద ప్రజల పైన విద్యుత్‌శాఖ విజిలెన్స్ కేసులు పెట్టి వేధిస్తున్న విషయం నిజం కాదా అని దుయ్యబట్టారు. ప్రజలను నమ్మించి వారి ఓట్లు వేయించుకోవాలనే బీఆర్‌ఎస్ మోసాన్ని ప్రజలు గుర్తిస్తారని తగిన గుణపాఠం చెబుతాన్నారు. సమావేశంలో బీజేపీ నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, ప్రవీణ్ రెడ్డిలు ఉన్నారు.

గ్రామాభివృద్ధికి సహకరించండి

సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి

నందిగామ: గ్రామాభివృద్ధికి గ్రామస్తులు సహకరించాలని సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు, స్థానిక సర్పంచ్ జిల్లెల వెంకట్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రం నందిగామలోని 6వ వార్డులో రూ.35 లక్షల పంచాయతీ నిధులతో సీసీ రోడ్డు పనులను జెడ్పీవైస్ చైర్మన్ ఈట గణేష్‌తో కలిసి సర్పంచ్ వెంకట్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాత జాతీయ రహదారి నుంచి బైపాస్ వరకు రోడ్డు విస్తరణ చేసి బీటీ, సీసీ రోడ్డు వేసేందుకు గ్రామస్తులు సహకరించాలని కోరారు. గ్రామాలు అభివృద్ధి చెందాలంటే గ్రామస్తుల పరస్పర సహకారం అవసరమన్నారు. ఇప్పటికే అనుబంధ గ్రామాల్లో సీసీ రోడ్లు, అంతర్గత మురుగు కాల్వల నిర్మాణం పనులు పూర్తి చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీల సంఘం జిల్లా అధ్యక్షుడు కొమ్ము కృష్ణ, ఉప సర్పంచ్ మెక్కొండ కుమార్‌గౌడ్, వార్డు సభ్యులు శ్రీనివాస్ రెడ్డి, ఈశ్వర్ యాదవ్, కృష్ణ, నాయకులు బాల్‌రెడ్డి, నర్సింహా పాల్గొన్నారు.

జీవాలకు టీకాలు తప్పనిసరి

షాబాద్: గొర్రెలకు, మేకలకు చిట్టుక వ్యాధి నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించాలని షాబాద్, రేగడిదోస్వాడ డాక్టర్లు స్రవంతి, చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని కొమరబండ, కక్కులూర్ గ్రామాల్లో పశువులకు, జీవాలకు చిట్టుక వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జీవాల ఆరోగ్యంపై రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. గొర్రెలు, మేకలు అనారోగ్యానికి గురికాకుండా ప్రభుత్వం ఏడాదిలో రెండు విడతలు చిట్టుక వ్యాధి నివారణ టీకాలు చేయడం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది ఉన్నారు.

గ్రామాల అభివృద్ధికి పెద్దపీట

సర్పంచ్ లలిత

షాద్‌నగర్‌రూరల్: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని సర్పంచ్ లలిత అన్నారు. మంగళవారం ఫరూఖ్‌నగర్ మండలంలోని మొగిలిగిద్దలో ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ సహకారంతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామంలోని సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. సమస్యల పరిష్కారానికి విడతల వారీగా అభివృద్ధి పనులను చేపట్టడం జరుగుతుందని చెప్పారు. మంచినీటి సరఫరా, సీసీరోడ్ల ఏర్పాటు, అంతర్గత మురుగు కాలువల నిర్మాణం, వీధిదీపాల ఏర్పాటు వంటి కనీస మౌలిక వసతులను కల్పించేందుకు చర్యలు చేపడుతున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ లావణ్య, ఎంపీటీసీలు జయలక్ష్మి, శ్రీశైలం, మాజీ వార్డుసభ్యులు అంజయ్య పాల్గొన్నారు.